## పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన

పాల్వంచ రూరల్, నవంబర్ 16 : మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో కనకదుర్గ అమ్మవారికి అర్చకులు గురువారం సువర్ణ పుష్పార్చన చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి 108 సువర్ణ పుష్పాలతో అర్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్తీకమాసం సందర్భంగా యాగశాలలో శివలింగానికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఈవో రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహీపతి రామలింగం పాల్గొన్నారు.

## ఎడవల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు


బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచ, నవంబర్ 16 : పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకులు గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నాయకుడు ఎడవల్లి కృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌కు చెందిన కాపా శ్రీనివాసరావు, చాంద్‌పాషా, సూర్య కిరణ్, చల్ల శివ, బట్టు వీరూనాయక్, గుండా శ్రీనివాసరావు, గంటి నాగేశ్వరరావు, శెట్టిపల్లి వెంకట్, వెంకన్న, మద్దినేని కృష్ణారావు, యమ్మన భాను తేజ బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ నుంచి వచ్చిన వారందరికీ కూడా గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారంతా కూడా కొత్తగూడెం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు గెలుపు కోసం కృషిచేస్తామని పేర్కొన్నారు.

## బక్కచింతలపాడులో వైద్యశిబిరం

పర్ణశాల, నవంబర్ 16 : మండలంలోని పర్ణశాల పీహెచ్‌సీ పరిధిలో ఉన్న బక్కచింతలపాడు గ్రామంలో డాక్టర్ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో గురువారం హెల్త్‌క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో పరీక్షించిన 46 మంది గర్భిణులు, ఇద్దరు జ్వరాలు ఉన్నవారు, నలుగురు జలుబు, దగ్గు, ఇతర చిన్నచిన్న సమస్యలతో బాధపడుతున్న 40మందికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌వీ అనసూర్య, హెచ్‌ఏ నాగేశ్వరరావు, ఏఎన్ఎం నరసమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండలంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం


ఎన్నికల ప్రచారం చేస్తున్న కొల్లు పద్మ

లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 16 : మండలంలోని శ్రీనగర్‌కాలనీ పంచాయతీలో రైతుబంధు సమితి కన్వీనర్ వట్టికొండ సాంబశివరావు, శ్రీనగర్‌కాలనీ సీనియర్ ఎంపీటీసీ కొల్లు పద్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ ప్రచారం చేశారు. వనమా మనుమరాళ్లు అలేఖ్య, హర్షిని, మనీషా శ్రీనగర్‌పంచాయతీలో ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో గాయత్రి, శకుంతల, మంజుల, కొండలరావు, మధు, సంపత్‌కుమార్, పెద్ద చిట్టెమ్మ, రజిని, రాధిక, రమ, విజయ, సుభద్ర, ఉమ, శిరీష, కుమారి, రాధ, పాపారావు, శ్రీలత, సుజాత, జయ, నరసింహారావు, వరలక్ష్మి, పావని, నాగమణి, పవిత్ర పాల్గొన్నారు.

## బాలోత్సవ్‌లో డీఏవీ విద్యార్థుల ప్రతిభ

పాల్వంచ, నవంబర్16 : పాల్వంచ పట్టణంలోని కేటీపీఎస్ కాలనీలో ఉన్న డీఏవీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఖమ్మం జిల్లా మధిరలో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి బాలోత్సవంలో ప్రతిభ కనబర్చారు. విచిత్ర వేషధారణ సీనియర్ విభాగంలో గూడవర్తి శ్రావ్య, కూచిపూడి నృత్యంలో చిన్మయి లహరి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను ప్రిన్సిపాల్ రామారావు, డాన్స్‌మాస్టర్ జి. వెంకటేశ్వర్లు అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, నవంబర్ 16: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వెదుళ్లచెరువు డొంక వద్ద చోటుచేసుకున్నది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. పిండిప్రోలు పంచాయతీ శివారు గ్రామం పాపాయిగూడెనికి చెందిన రేపాకుల రాజు(45) గురువారం బైక్‌పై పిండిప్రోలు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మరిపెడ బంగ్లా వైపు నుంచి ఖమ్మం వెళ్తున్న కారు మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి బైక్‌ను ఢీకొట్టి రోడ్డు కిందకు వెళ్లింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న రాజు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ సంభాని చంద్రశేఖర్ పరామర్శించారు. అలాగే కారులో ప్రయాణిస్తున్న ఓ మహిళ స్వల్ప గాయాల పాలైంది. క్షతగాత్రురాలిని స్థానికులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

# నా తమ్ముడు అజయ్‌ను గెలిపించండి

**కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు**

**రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ**


మాట్లాడుతున్న హోం మంత్రి మహమూద్ అలీ

ఖమ్మం, నవంబర్ 16: నా తమ్ముడు అజయ్‌ను ఎన్నికల్లో గెలిపించాలని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. గురువారం సాయంత్రం ఖమ్మం నగరంలోని సెయింట్ మేరీస్ పాఠశాల ఆవరణలో జరిగిన ముస్లిం, మైనార్టీల ఆత్మీయ సభలో హోంమంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీవి ఉత్తుత్తి మాటలే అని, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్‌లో 50 లక్షల మంది ఉన్న ముస్లింలకు ఎన్ని నిధులు కేటాయించారో చెప్పాలని హోంమంత్రి డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ఖమ్మం జిల్లాకు ఎన్నో నిధులు ఇచ్చారని, తద్వారా ఖమ్మం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం కేసీఆర్ పోరాడుతుంటే ఆయనను కొందరు హేళన చేశారని, రాష్ట్రం వస్తే ఎలా అభివృద్ధి చేసుకుంటారని హేళనగా మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. అజయ్‌కుమార్‌కు అజయ్‌ఖాన్ అని గొప్ప పేరు ఇచ్చారని, ఈ సారి ఎక్కువ మెజార్టీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ముస్లింల కోసం సీఎం కేసీఆర్ 32 వందల కోట్లు ఖర్చు చేశారని, ముస్లింల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 50 లక్షలు కూడా ఖర్చు చేయలేదన్నారు. పేద వాడి కోసం పని చేసిన సీఎం ఎవరైనా ఉన్నారంటే.. అది సీఎం కేసీఆర్ మాత్రమేనని అన్నారు. ఖమ్మం నియోజకవర్గం పట్ల పువ్వాడ అజయ్‌కు ఉన్న నిబద్ధత ఎవరికీ లేదన్నారు. భారీ మెజార్టీతో నా తమ్ముడు అజయ్‌ను గెలిపించాలని కోరారు.

**నేను ఇక్కడే పుట్టా.. ఇక్కడే ఉంటా: అజయ్**

నేను మీ బిడ్డను, ఇక్కడే పుట్టాను, ఇక్కడే చదువుకున్నాను, ఇక్కడే పెరిగాను..ఇక్కడే ఉంటాడని, నా నైట్ హాల్ట్ ఇక్కడే.. ఇక్కడి ప్రజలంతా నా బంధువులు, నేను మీ బిడ్డను అని ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి అజయ్‌కుమార్ అన్నారు. తుమ్మల ఇక్కడ ఉండడని, ఎన్టీఆర్‌ను మోసం చేసి చంద్రబాబు పంచన చేరాడు.. చంద్రబాబును మోసం చేసి కేసీఆర్ దగ్గరకు వెళ్లారు.. ఇప్పుడు కేసీఆర్‌ను కూడా మోసం చేశాడన్నారు. హోం మంత్రి మహమూద్ అలీ నన్ను ఎప్పుడు తమ్ముడు అని సంబోధిస్తారని, నాకు చాలా ఆనందంగా అనిపిస్తుందన్నారు. కొంతమంది డబ్బు ప్యాకేజీలు ఇచ్చి తీసుకుని పోతున్నారని, నేను ప్రజలను నమ్ముకున్నా.. వారే నాకు అండగా ఉంటారన్నారు.

**మైనార్టీలను కాంగ్రెస్ ఓటు బ్యాంక్ గానే చూసింది : ఎంపీ నామా**

సీఎం కేసీఆర్‌కు హోం మంత్రి మహమూద్ అలీ అంటే చాలా ఇష్టమని, వారికి ప్రభుత్వం ఏర్పడిన రెండుసార్లు కీలక పదవులు అందించారని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 11 సార్లు దేశాన్ని, రాష్ట్రాన్ని, జిల్లాను పాలించారని, అప్పుడు వారు రాష్ట్రానికి చేసింది ఏమి లేదని, కానీ ఇప్పుడు మరో సారి అవకాశం ఇస్తే వారు అభివృద్ధి చేసి చూపుతారంట.. ఎలా నమ్ముతారు.. ఇన్నేళ్లు చేయనోడు ఇప్పుడు చేస్తాడా.. అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలను ఎప్పుడూ ఓటు బ్యాంక్‌గానే చూసిందని, మీ అభివృద్ధిని కోరుకున్నది కేసీఆర్ మాత్రమేనని అన్నారు. ఈ సభలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, యువజన విభాగం జిల్లా కార్యదర్శి పల్లా కిరణ్, కార్పొరేటర్లు పల్లా రోజ్‌లీనా, షేక్ మక్బుల్, షౌకత్ అలీ, కర్నాటి కృష్ణ, దాదే అమృతమ్మ, నాయకులు ఖమర్, పల్లా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా..

**రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే..**

**ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయి**

**మండలంలో ఎన్నికల ప్రచారంలో మధిర అభ్యర్థి లింగాల్ కమల్‌రాజు**


మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజు

ఎర్రుపాలెం, నవంబర్ 16 : ప్రస్తుత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని, మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ మధిర ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి మండలంలోని కొత్తగోపవరం, భీమవరం, అయ్యవారిగూడెం, రాజులదేవరపాడు, మామునూరు, లక్ష్మీపురం, చొప్పకట్లపాలెం, బనిగండ్లపాడు, బుచ్చిరెడ్డిపాలెం, నరసింహాపురం, కాచవరం గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడుసార్లు ఎమ్మెల్యేగా భట్టి విక్రమార్కను గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి పని చేసింది శూన్యమన్నారు. ఇప్పటికే జడ్పీ చైర్మన్‌గా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు చేరువ చేశానన్నారు. ప్రజలు ఇప్పటికైనా భట్టి విక్రమార్క మాయమాటలు నమ్మి మోసపోకుండా.. వాస్తవాలను గ్రహించి ప్రజల కోసం పనిచేసే తనకే పట్టం కట్టాలని కోరారు. బనిగండ్లపాడులో యస్సం సత్యనారాయణరెడ్డి, నీలం రవి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి వంద కుటుంబాలు, మామునూరులో 5 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి అభ్యర్థి లింగాల కమల్‌రాజు, కొండబాల గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ చావా రామకృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, ఎంపీపీ దేవరకొండ శిరీష, జడ్పీటీసీ శీలం కవిత, నాయకులు అప్పారావు, బాలరాఘవరెడ్డి, శీలం వెంకటరెడ్డి, రామకోటయ్య, కొండేపాటి సాంబశివరావు, చిట్టిబాబు, శ్రీకాంత్‌రెడ్డి, మూల్పూరి శ్రీనివాసరావు, కృష్ణారావు, కోట శ్రీనివాసరావు, రాధమ్మ, రేణుక, మదన్మోహన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రవి, భాస్కర్, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, నాగేశ్వరరావు, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కిషోర్‌బాబు, సుధీర్, వెంకటనారాయణ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


ఫోన్ అప్పగిస్తున్న ఆటోడ్రైవర్

## దొరికిన మొబైల్ అప్పగింత

కొత్తగూడెం క్రైం, నవంబర్ 16: రహదారిపై దొరికిన మొబైల్‌ను ఓ ఆటోడ్రైవర్ పోలీసులకు అప్పగించి తన నిజాయతీని చాటుకున్నాడు. ట్రాఫిక్ ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెనికి చెందిన ఆటోడ్రైవర్ ప్రేమ్‌కుమార్‌కు సూపర్ బజార్ రోడ్డుపై మొబైల్ దొరికింది. ఆ మొబైల్‌ను వెంటనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సిబ్బందికి అప్పగించారు. ఎస్సై నరేశ్‌కుమార్ మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తికి సమాచారం అందించి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు రప్పించి మొబైల్ ఇచ్చారు. ఆటోడ్రైవర్ నిజాయతీని ట్రాఫిక్ పోలీసులు అభినందించారు.

# బీఆర్ఎస్ గెలుపు కోసం పనిచేస్తా


కొండూరు సుధాకర్‌ను కలిసిన సండ్ర, బండి

సత్తుపల్లి టౌన్, నవంబర్ 16: బీఆర్ఎస్ గెలుపు కోసం శాయశక్తులా పనిచేస్తానని బీఆర్ఎస్ నేత కొండూరు సుధాకర్ అన్నారు. గురువారం ఆయన్ను పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి తాను ఉద్యోగం చేసుకుంటుంటే పిలిచి మరీ ఆ పార్టీలోకి ఆహ్వానించారని, టికెట్ ఇవ్వకుండా మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కోసం తన ఉన్నతమైన ఉద్యోగాన్ని వదిలి వచ్చానన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆహ్వానం మేరకు తాను బీఆర్ఎస్‌లో చేరానన్నారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యను గెలిపించేందుకు తామూ పని చేస్తానని స్పష్టం చేశారు. వారి వెంట నాయకులు సంజీవరెడ్డి, వెంగల సురేష్, కాంతారావు ఉన్నారు.

## సాయిబాబా ఆలయంలో అన్నదానం

భద్రాచలం, నవంబర్ 16 : ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని సాయిబాబా ఆలయంలో కార్తీకమాసం తొలి గురువారం సందర్భంగా బాబాకు ప్రత్యేక అభిషేకం, అర్చనలు జరిపారు. డాక్టర్ ఆర్.నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి స్వర్ణకుమారి 2500 మందికి అన్నదానం చేశారు. అయ్యప్ప మాలధారులు, భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదానం దాతలు స్వర్ణకుమారి కుమార్తె, అల్లుడు యలవర్తి లక్ష్మి శ్రీనివాస్ ఆనంద్‌ను ఆలయ అధ్యక్షుడు తుమ్మలపల్లి సతీశ్ సత్కరించి, బాబా చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ట్రెజరర్ కుంచాల రమేశ్ పాల్గొన్నారు.